క్లుప్తంగా

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికపై వివరిస్తున్న కర్త ఫౌండేషన్ ప్రతినిధులు

సీతంపేట: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏఎంఓ కోటిబాబు అన్నారు. మండలంలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఢిల్లీకి చెందిన కర్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్మీడియట్, టెక్నికల్ కోర్సులు, కాంపిటేటివ్ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలన్న దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమావాణి, ఎన్‌జీఓ సంఘ ప్రతినిధులు శశాంక్ మాలిక్, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి



శివ్వాంలో మొలకలు వచ్చిన వరిచేనును చూపిస్తున్న రైతులు

గరుగుబిల్లి: తుపాను వర్షాల కారణంగా రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని శివ్వాం గ్రామంలో ఇటీవల వర్షాలకు పొలాల్లోని వరి కుప్పలు పూర్తిగా తడిసిపోయి వరి పనల నుంచి మొలకలు వచ్చాయని బాధిత రైతులు గుండు అప్పలనాయుడు, బూరి సింహాచలంనాయుడు, బొంగు రామినాయుడు వాపోయారు. మరికొంత మంది రైతులకు చెందిన 10 ఎకరాల పంటలో కూడా మొలకలు వచ్చాయని తెలిపారు. పంట చేతికి అందివచ్చే సమయంలో అకాల వర్షాలు తమను దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన వరి పనల కారణంగా ధాన్యం రంగు మారే అవకాశం ఉందని, వాటిని ప్రభుత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రామాలయంలో కుంకుమ పూజలు

బలిజిపేట: ధనుర్మాస పూజలలో భాగంగా వెంగాపురం రామాలయంలో గురువారం స్వామివారికి కుంకుమ పూజలు జరిపారు. అర్చకులు గోపాలకృష్ణ, ఫణికుమార్ శర్మ, సూర్యనారాయణల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలను నిర్వహించారు. ధనుర్మాసంలో విశేష రోజులలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏకాదశి సందర్భంగా ఆలయంలో మహిళలచే కుంకుమ పూజలు జరిపించారు.

నిబంధనలు పాటించాలి

మక్కువ: వాహనదారుడుతో పాటు, వెనుకన కూర్చున్న ప్రయాణికుడు హెల్మెట్ ధరించాలని ఏఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రం మక్కువలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన ప్రమాదం సంభవించే సమయంలో ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్నారు. వాహనదారులందరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వరాదని సూచించారు. మితిమీరిన వేగం ప్రమాదకరమని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీతీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి వారు గురువారం భక్తులకు పత్రాలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామి వారికి అర్చకులతో ప్రత్యేక అలంకరణ చేసారు. పూజల్లో భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా హక్కుల కోసం పోరాడే పార్టీ సీపీఐ

పార్వతీపురం టౌన్: ప్రజా హక్కుల కోసం నికరంగా పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)అని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలో ఉన్నటువంటి లిడికివలస, పుట్బూరు, పెద్దబొండపల్లి తదితర గ్రామాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పేదలకు భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనేక భూ పోరాటాలు చేసి వేలాది ఎకరాలు భూములను పేదలకు పంచిన ఘనమైన చరిత్ర సీపీఐ పార్టీకే ఉందన్నారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్లో భారత కమ్యూనిస్టు పార్టీ జెండా ఎగరవేయడం జరిగిందన్నారు. పేదల హక్కుల కోసం సమ సమాజ నిర్మాణం కోసం, సమానతలు లేని సమాజం కోసం సీపీఐ పార్టీ పోరుబాట సాగిస్తుందని, 1/70 అటవీ హక్కుల చట్టం ప్రకారం అటవీ భూముల్లో జీవించే హక్కు ఒక్క గిరిజనులకు మాత్రమే దక్కుతుందన్నారు.

రైతులను ఆదుకోవాలి



తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిబంధనలు సడలించి రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు నెల్లి సూర్యనారాయణ, గంగుల శ్రీనివాసరావు, కాయల జయరామ్, మచ్చా విజయ్, కారెపు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు. – పాలకొండ

జైలు పరిసరాలు పరిశుభ్రం



జైలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జైళ్ల శాఖ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ సూచించారు. గురువారం స్థానిక సబ్‌జైల్‌ను ఆయన సందర్శించారు. జైలు పరిసరాలను పరిశీలించి మొక్కలు నాటారు. అలాగే వంటగది, రికార్డులు పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడుతూ సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయనతో పాటు జిల్లా జైలు శాఖాధికారి కె. మోహన్ రావు, సూపరింటిండెంట్ జోగులు, సిబ్బంది ఉన్నారు. – పాలకొండ

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం



మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయమని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. మండల కేంద్రంలో సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 30 మంది గిరిజన మహిళలకు గురువారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతోనే కుట్టు శిక్షణ ఇప్పించామన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు. భామిని:

వేరుశనగ సాగులో.. మెలకువలు పాటించాలి

● ఉద్యానవన అధికారి అమరేశ్వరి



వేరుశనగ పంట

పాలకొండ రూరల్: రబీ సీజన్‌లో వాణిజ్యపంటగా వేస్తున్న వేరుశనగ సేద్యంలో చీడపీడల నివారణపై అవగాహన పెంచుకుని మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన అధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. విత్తిన వేరుశనగలో చీడపీడల ఉధృతిని సకాలంలో గుర్తించడం, వరుసగా వర్షాలు కురుస్తున్న క్రమంలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలుపై పలు సూచనలు చేశారు.

పొగాకు లద్దెపురుగు...

ఈ పురుగు గోధుమ రంగులో ఉండి ఎక్కువగా వేరుశనగ మొక్కల కింద ఉంటే రాళ్లు, మట్టిపెల్లలపై చేరుతాయి. ఉదయం పూట కిందనే ఉండి రాత్రి సమయంలో బయటకు వచ్చి పైరుపై దాడి చేస్తాయి. ఆకులను పూర్తిగా తినేస్తాయి. ఈ పురుగును గుర్తించినప్పుడు ఎకరాకు 200 లీటర్ల నీటిలో 200 గ్రాముల థయోడీకార్బ్ లేదా 200 ఎం.ఎల్ నొవాల్యూరాన్ కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా ఐదు కిలోల తవుడు, ఆరు కిలోల బెల్లం, మోనోక్రోటోపాస్ లేదా క్లోరిపైరిపాస్ 500 మిల్లీలకు కొద్దిగా నీరు కలిపి చిన్న ఉండలుగా చేసి సాయంత్ర వేల చేల వరుసల మధ్య జల్లితే మంచి ప్రయోజనం ఉంటుంది.

ఆకు ముడత తెగులు...

బూడిద రంగులో ఉండే పురుగులు ఆకులపై చేరి తెల్లని గుడ్లు పెడతాయి. ఈ గుడ్ల నుంచి వెలువడిన పురుగులు ఆకుల నుంచి రసాన్ని పీల్చడం వల్ల ఆకు మడత పడే ప్రమాదం ఉందని.. దీనిని నివారించేందుకు క్వినాల్‌పాస్ పొడిమందు ఎకరాకు 10 కిలోల చొప్పున వాడాలన్నారు. పొలంలో లోతుగా దున్ని ఫాలిడాల్ మందు చల్లడం మంచిది. పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే డైమిథోయేట్ 400 మిల్లీలు లేదా మోనోక్రోటోపాస్ 320 మిల్లీల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పైరుపై పిచికారీ చేయాలి.

రసం పీల్చు పురుగు...

పచ్చదోమ, పేనుబంక, తామరపురుగులు వంటివి మొక్క నుంచి రసం పీల్చుతాయి. దీంతో ఆకులు ముడుచుకుపోవడం, రంగు మారడం, మచ్చలేర్పడడం వంటివి జరుగుతాయి. ఈ పురుగుల నివారణకు ఎకరాకు మోనోక్రోటోపాస్ 320 మిల్లీలు, వేపనూనె లీటరు చొప్పున కలిపి పైరుపై పిచికారీ చేయాలి. పేనుబంక, పచ్చదోమ నివారణకు ఎకరాకు డైమిథోయేట్ 400 మిల్లీలు లేదా మిథైల్-ఒ-డెమటాన్ 400 మిల్లీలు లేక ఎసిటామిప్రిడ్ 40 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వేరు పురుగు...

వేప, రేగు, మామిడి, మునగ, చీనీ, తదితర చెట్లపై ఉన్న వేరు పురుగులు శనగ పంటకు వ్యాపిస్తాయని.. ఈ పురుగు వ్యాపించిన చెట్లు ఎండిపోయి చనిపోతాయి. ఈ పురుగు నివారణకు ఫోరెట్ (10శాతం) రకం గుళికలు ఎకరాకు ఆరు కిలోలు వేయాలి. మరిన్ని సలహాలకు సంబంధిత అధికారులను సంప్రదించాలని అధికారి సూచించారు.

అన్నదాత ఆక్రందన..



వీరఘట్టం: తడిచిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు



భామిని: నేరడిలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

వీరఘట్టం: వరి పంట చేతికొచ్చే సమయంలో అల్ప పీడనం, వరుస తుఫాన్లకు పొలాల్లో ఉన్న వరి కుప్పలు, కళ్లాల్లోని ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తడిచిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉంటే మండలంలోని పలు గ్రామాల్లో ఏఓ జె.సౌజన్య గురువారం పర్యటించి, తడిచిన పంటను కాపాడుకోవడానికి చేపట్టాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. తడిచిన వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు.

– ఆరబోతలో బిజీగా..

భామిని: వర్షాలకు తడిచిపోయిన ధాన్యాన్ని రైతులు ఆరబెడుతున్నారు. గురువారం కాస్త ఎండ కాయడంతో రైతులు కళ్లాలు, రోడ్లపై తడిచిన ధాన్యంతో పాటు వరి పనలను ఎండబెట్టే పనిలో బిజీగా కనిపించారు.

అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలి

● డీఈఓ తిరుపతినాయుడు



ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ తిరుపతినాయుడు

వీరఘట్టం: ప్రతి పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆయా పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థి కొరికాన రవికుమార్ ఇటీవల రూ.5 లక్షల విలువ గల ఆర్ఓ ప్లాంట్‌ను పాఠశాలకు అందజేయగా.. డీఈఓ తిరుపతినాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ఆర్ఓ ప్లాంట్ బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. పూర్వ విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పత్రి కృష్ణమూర్తి, వీరఘట్టం ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, హెచ్ఎం జి.రవిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ చార్జీలపై పోరుబాట..

● ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై మోయలేని భారం వేసిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండలో గురువారం వీరు మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపుమేరకు కరెంట్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం పాలకొండలో పోరుబాట కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు హామీలు అమలు చేయలేకపోతున్నారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి.. కుర్చీ ఎక్కిన తర్వాత ఎడాపెడా పెంచడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ డివిజన్ కేంద్రంలో నిర్వహించనున్న ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం గృహం వద్దకు అందరూ చేరుకోవాలని కోరారు.

గరుగుబిల్లి: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ కురుపాంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే పోరుబాట కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి పాల్గొంటారని తెలిపారు.

కులగణన సర్వే జాబితా ప్రదర్శన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఎస్సీ కులగణన సర్వే జాబితా ప్రదర్శించడం జరిగిందని కురుపాం ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి గురువారం తెలిపారు. జాబితాలో ఎవరి వివరాల్లోనైనా తప్పులుంటే 2025 జనవరి 6వ తేదీలోగా తెలియజేసి, సవరించుకోవాలన్నారు.

విద్యుత్ కార్మికుల పోరాటానికి అండగా సీఐటీయూ

బలిజిపేట: విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కార్మికులకు సంఘీభావంగా స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు మాట్లాడుతూ ఒక ప్రైవేటు కార్పొరేట్ సంస్థ అయిన ఇమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్‌కు విక్రయించడానికి నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయమన్నారు. ఈ సంస్థలో కేవలం 500 మంది రెగ్యులర్, 500 మంది కాంట్రాక్ట్ కార్మికులు మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. వేల కోట్ల లాభాలు గడిస్తున్న ఈ విద్యుత్ డిస్కంలను చౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని విమర్శించారు.

గోదాదేవి అమ్మవారి తిరువీధి

సీతానగరం మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీతీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వేకువజామున గోవింద మాలలు ధరించిన భక్తులు గోదాదేవి అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తూ తిరువీధి నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను అలంకరించి పూలతో ప్రత్యేక అలంకరణ చేసి పల్లకిలో తిరువీధి చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేసారు. – సీతానగరం

గుంతల నిర్మాణంతో కరువు నివారణ

భామిని: ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట సంజీవిని పేరుతో గుంతలు తీయడం వల్ల కరువును నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి కె. సింహాచలం అన్నారు. మండలంలోని పోలవరం, వడ్డంగి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలకు పాడైన పంటలకు సంబంధించి నష్ట నివారణపై పలు సూచనలు చేశారు. అనంతరం మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొలక దశలో 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు నాగరాజు, వెటర్నరీ సహాయకురాలు శిరీష, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న ఎంఏఓ సింహాచలం

నియామకం



రెడ్డి పావని నుంచి నియామకపత్రం అందుకుంటున్న శంకరరావు

భామిని: బీజేపీ మండల అధ్యక్షుడిగా కలిశెట్టి శంకరరావును నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి రెడ్డి పావని, పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. శంకరరావును పార్టీ నాయకులు భానుప్రసాద్ సాహూ, కొత్తకోట తిరుపతిరావు, టంకాల వాసుదేవరావు, తదితరులు అభినందించారు.

వీఆర్ఓల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



తహసీల్దార్ సత్యనారాయణను కలిసిన వీఆర్ఓల సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

వీరఘట్టం: మండల వీఆర్ఓల సంఘ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓల సంఘ జిల్లా సభ్యులు పొన్నాడ రఘునాయుడు, వంజరాపు రమేష్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించగా.. ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. మండల సంఘ నూతన అధ్యక్షుడిగా బాసూరు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా పాలవలస నగేష్, ఉపాధ్యక్షుడిగా వి.దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా రావుపల్లి చక్రధర్, జాయింట్ సెక్రటరీగా కిక్కిర సాయిరాం, కోశాధికారిగా చీపురుపల్లి ప్రభావతి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు తహసీల్దార్ చందక సత్యనారాయణను కలిశారు. దీంతో ఆయన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

సమన్వయంతో పట్టణాభివృద్ధి

● నగర పంచాయతీ చైర్మన్ ప్రతాప్



మాట్లాడుతున్న చైర్మన్ ప్రతాప్

పాలకొండ: పాలకవర్గం, అధికారుల సమన్వయంతోనే నగరాభివృద్ధి జరుగుతుందని నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ అన్నారు. నగర పంచాయతీ చైర్మన్‌గా గురువారం బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో తిష్ట వేసిన ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు, పారిశుధ్యం, కాలువల నిర్వహణపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పాలకవర్గ సభ్యులు, నగర పంచాయతీ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద సీపీఐ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శత వార్షికోత్సవం చేయగా, ఆ పార్టీ శ్రేణులంతా హాజరై, సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఈ వందేళ్ల కాలంలో ప్రజల తరఫున సీపీఐ చేసిన పోరాటాలు వాటి ఫలితాలను గుర్తు చేసుకున్నారు. సమానత్వం, సామాజికన్యాయం, కార్మిక, రైతుల హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని సీపీఐ నాయకులు సింగన్న, పువ్వల ప్రసాద్, మోహన్‌రావు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



బోరు తవ్విస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు లుంబేసు గ్రామ సర్పంచ్ తోయక సీతమ్మ తెలిపారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మంజూరైన రూ.12 లక్షల నిధులతో తాగునీటి బోరును గురువారం తవ్వించారు. ఈ బోరు ఏర్పాటు పనులకు ఆమె భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మండంగి గౌరమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోండి



పోలీసులకు సూచనలిస్తున్న ఏఎస్పీ అంకిత సురాన

కొమరాడ: అంతర్ రాష్ట్ర రహదారులపై అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు చేపట్టి మాదకద్రవ్యాల రవాణా జరగకుండా అడ్డుకోవాలని ఏఎస్పీ అంకిత సురానా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించిన ఆమె.. రికార్డులు, కేసుల వివరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల బారినపడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ చట్టాలు, నేరాలు-శిక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గతంలో పట్టుబడిన మద్యం, సారాని ధ్వంసం చేశామని ఎస్ఐ నీలకంఠం తెలిపారు.